

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం, కలెక్టరేట్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల24 నుంచి మార్చి 30 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ విద్యార్థులు రూ.150 రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



అప్రమత్తంగా లేకుంటే అంతే!



- ఈ నెల 2న ఓ యువకుడు రాజాం బజార్ రోడ్‌లోని ఓ కిరాణా దుకాణానికి వచ్చి రూ.135 విలువ చేసే వంట నూనె ప్యాకెట్ కొన్నాడు. ఫోన్ పే చేస్తానని చెప్పి అక్కడున్న క్యూఆర్ కోడ్‌ను తన ఫోన్‌తో స్కాన్ చేశాడు. నగదు చెల్లించినట్లు షాపు యజమానికి చూపించాడు. ఆ సమయంలో బిజీగా ఉన్న యజమాని తలూపాడు. కొద్దిసేపటి తరువాత చూస్తే రూ.135 తన బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. దీంతో ఆ యువకుడు మోసం చేసినట్లు గ్రహించాడు.
- ఈ నెల 8న శ్రీకాకుళం రోడ్‌లో ఓ టిఫిన్ సెంటర్ వద్ద రూ.200 విలువచేసే టిఫిన్‌ను పార్శిల్ చేయించాడో వ్యక్తి. ఫోన్ పే చేస్తానని చెప్పి స్కాన్ చేశాడు. నగదు చెల్లించినట్లు టిక్ మార్క్ చూపించడంతో అక్కడున్న మహిళ సరేనంది. దీంతో ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. కొంతసేపటి తరువాత ఆ మహిళ తన బ్యాంకు ఖాతాను చెక్ చేయగా రూ.200 జమ కాలేదు. మరి ఆ వ్యక్తి చూపించిన టిక్ మార్కు దేనిదో తెలియక అయోమయానికి గురైంది.
- ఈ నెల 11న రాజాం మెయిన్‌రోడ్‌లోని ఓ దుకాణం వద్ద నలుగురు యువకులు ఫ్రూట్ జ్యూస్ తాగారు. ఫోన్ పే స్కాన్ చేసి రూ.160 చెల్లించినట్లు టిక్‌మార్క్ చూపించారు. షాపు యజమాని తన ఫోన్‌పే చూసి నగదు రాలేదని చెప్పాడు. దీంతో తమ పాచిక పారలేదని గ్రహించిన ఆ యువకులు చేసేది లేక మరోసారి స్కాన్ చేసి ఆ మొత్తాన్ని చెల్లించారు. ఇలాంటి సంఘటనలు జిల్లావ్యాప్తంగా కోకొల్లలు. యూపీఐ చెల్లింపుల పేరుతో కొంతమంది వ్యక్తులు చిరు వ్యాపారులను మోసం చేస్తున్నారు.

- యూపీఐ పేమెంట్ పేరుతో మోసం
- డబ్బులు చెల్లించినట్లు మెసేజ్ చూపించి ఉడాయిస్తున్న వైనం
- నష్టపోతున్న చిరు వ్యాపారులు

రాజాం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీపై పూర్తి అవగాహన ఉన్న కొంతమంది యువకులు చిన్న, మధ్యతరహా వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. తమ జిమ్మిక్కులతో చిన్న వ్యాపారులను బురిడీ కొట్టిస్తున్నారు. రద్దీగా ఉండే కిరాణా షాపులు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పండ్ల వ్యాపారులనూ వదలట్లేదు. రద్దీగా ఉండే షాపుల వద్దకు ఇద్దరేసి బైక్‌పై వెళ్తున్నారు. ఒకరు ద్విచక్ర వాహనంపై ఉండి మరొకరు ఏదో ఒక వస్తువు కొనుగోలు చేస్తున్నారు. యూపీఐ పేమెంట్ చేస్తామని చెప్పి దుకాణం వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను తన ఫోన్‌తో స్కాన్ చేస్తున్నారు. ట్రాన్స్‌క్షన్ సక్సెస్‌ఫుల్ అని నకిలీ యాప్ ద్వారా గ్రీన్ టిక్ మార్కు చూపించి ఉడాయిస్తున్నారు. ఒక్కోసారి గతంలో వేరెవరికో వాస్తవంగా చెల్లించిన నగదుకు సంబంధించిన టిక్‌మార్క్‌ను షాపు యజమానికి చూపించి మోసం చేస్తున్నారు. ఇటీవల కాలంలో నకిలీ యాప్‌ల సంఖ్య పెరిగిపోవడంతో మోసాలు కూడా ఎక్కువయ్యాయి.

- ఇలాంటి మోసాలపై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా స్కాన్ చేసి నగదు పంపించామని చెబితే తక్షణమే తన బ్యాంకు ఖాతాను చెక్ చేసుకోవాలి. షాపు యజమాని మొబైల్‌కు గాని, ఫోన్ పే, పేటీఎం, భారత్ పే వంటి సంస్థలు సమకూర్చిన పరికరంలో గాని రిసీవ్ చేసుకున్న మొత్తం వివరాలు శబ్దరూపంలో వస్తుంది. ఫోన్‌కు మెసేజ్ రాకపోయినా, ప్రత్యేక పరికరం మోగకపోయినా అప్రమత్తంగా ఉండాలి. ఆ మొత్తం రాలేదని తెలుసుకోవాలి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, శబ్దం తరువాత వినిపిస్తుందిలే అనుకున్నా మోసపోయే అవకాశం ఉంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



చిరు వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి. నగదు చెల్లింపుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సైబర్ నేరగాళ్లు ఏ ఒక్క అవకాశాన్నీ వదలరు. రూ.వేలు, రూ.లక్షల్లోనే కాదు వందల రూపాయల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే నష్టపోతారు.

-అశోక్‌కుమార్, సీఐ, రాజాం టౌన్

భూములు మారుతున్నాయ్!



గంట్యాడలో ల్యాండ్ కన్వర్షన్ జరిగిన వ్యవసాయ భూమి

డివిజన్ల వారిగా ల్యాండ్ కన్వర్షన్ వివరాలు..

	దరఖాస్తులు	ఎకరాలు	ఆదాయం
2021-22 (ఉమ్మడి జిల్లా)			
విజయనగరం	502	1430	రూ.3.68 కోట్లు
పార్వతీపురం	85	121	రూ.63 లక్షలు
2022-23 (విజయనగరం జిల్లా)			
విజయనగరం	1902	852.79	రూ.7.20 కోట్లు
బొబ్బిలి	58	81.55	రూ.36 లక్షలు
చీపురుపల్లి	39	109.47	రూ.37 లక్షలు
2023-24 (విజయనగరం జిల్లా)			
విజయనగరం	460	567.41	రూ. 5.91 కోట్లు
బొబ్బిలి	109	136.18	రూ.78 లక్షలు
చీపురుపల్లి	71	27.63	రూ.11 లక్షలు

- పెరిగిన ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు
- విజయనగరం డివిజన్‌లో అధికం
- పంట పొలాలు వ్యవసాయేతర భూములుగా మార్పు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూమార్పిడి అధికంగా జరుగుతోంది. వ్యవసాయ భూమి విలువను పెంచుకోవడానికి గాను ఎక్కువ మంది రైతులు ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో ప్రతిఏటా ఈ దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా కేంద్రం విజయనగరం డివిజన్ నుంచి అధి కంగా దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే లైన్ల ఏర్పాటు, సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యవసాయ భూములు అవసరమవుతున్నాయి. దీంతో అధికారులు భూసేకరణ చేపడుతున్నారు. అయితే, ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువగా ఉంటుంది. దీంతో రైతులు ల్యాండ్ విలువను పెంచుకోవడానికి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకుంటున్నారు. ఇందుకు అవసరమైన ల్యాండ్ (మిగతా 8వ పేజీలో..)

గజపతినగరంలో దొంగల బీభత్సం

- గంటన్నర వ్యవధిలో 8 షాపుల్లో చోరీ
- రూ.1.57లక్షల నగదు, ఫోన్లు, వాచీలు, ఇతర సామగ్రి అపహరణ
- త్వరలో నిందితులను అరెస్టు చేస్తాం: డీఎస్పీ



క్లూస్‌టీమ్ నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ భవ్యరెడ్డి



ఆర్‌కే మార్టులో షెట్టర్ తెరిచిన దృశ్యం



సీసీ కెమెరాను ధ్వంసం చేసిన దృశ్యం

గజపతినగరం ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. గంటన్నర వ్యవధిలో 8 షాపులను లూటీ చేశారు. రూ.1.57లక్షల నగదుతో పాటు ఫోన్లు, వాచీలు, ఇతర విలువైన సామగ్రిని దోచుకున్నారు. దీంతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న డీమార్ట్, సూపర్ మార్కెట్, వెంకీ మొబైల్‌షాపు, తిరుమల ట్రేడర్స్, మెంటాడ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఆర్‌కే మార్ట్, వాకర్స్ చెప్పుల షాపు, వెంకటేశ్వర కిరణా జనరల్ షాపు, ఉమెన్స్ కిడ్ జోన్ షాపుల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఆర్‌కే మార్ట్, తిరుమల ట్రేడర్స్‌లో సీసీ కెమెరాలను తీసి కిందపడేశారు. సూపర్ మార్కెట్‌లోని సీసీ కెమెరాలను తొలగించి కాలువలో పడేశారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 3.30గంటల మధ్య ఈ చోరీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.ఆటోలు వస్తున్న సమయంలో వారికి కనిపించకుండా దొంగలు ఓ షాపు మెట్లపై పడుకున్నట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. డీమార్ట్‌లో రూ.10వేలు, తిరుమల ట్రేడర్స్‌లో రూ.5వేలు, వెంకీ మొబైల్స్ షాపులో రూ.92వేల నగదు, 25సెల్‌ఫోన్లు, 6 వాచీలు, సూపర్ మార్కెట్‌లో రూ.6 వేలు, ఆర్‌కే మార్ట్‌లో రూ.30వేలు, వాకర్స్ చెప్పులషాపులో రూ.వెయ్యి, వెంకటేశ్వర కిరాణా దుకాణంలో రూ.6వేలు, ఉమెన్‌కిడ్స్ జోన్‌లో రూ.10వేలు నగదు పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.లక్ష్మణరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షాపుల షట్టర్లకు వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలను సేకరించింది. బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి, సీఐ రమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి మాట్లాడుతూ.. దొంగలు బిక్షగాళ్లుగా నటించి, షాపుల షట్టర్లను పూర్తిగా తెరవకుండా ఒక మనిషి వెళ్లినంతగా షట్టర్లు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు చెప్పారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వారిని (మిగతా 8వ పేజీలో..)

అంగన్‌వాడీ కేంద్రాలను కొత్త భవనాల్లోకి మార్చాలి

- కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం, కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్లు లేని ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను తక్షణం ఖాళీ చేసి, వారంలోగా వాటిని కొత్త భవనాల్లోకి మార్చాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఐసీడీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి జాబితాను అందించాలన్నారు. వెంటనే వాటికి ఆ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి నెలా చిన్నారుల బరువు, ఎత్తును కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అంచనాల ప్రకారం వేయరాదన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ రుక్సానాబేగం, జిల్లా వైద్యాధికారి జీవన రాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, డీఈవో మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా న్యాయాధికారి సాయికల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయాధికారి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. శుక్రవారం కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీ చేయాల్సిన క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులను గుర్తించాలన్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి లోక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించాలని సూచించారు. తద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్, న్యాయాధికారులు దేవి రత్నకుమారి, బి.రమ్య, టి.బుజ్జి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మన చుట్టూ పాలిథిన్ కవర్లే!

- తూతూ మంత్రంగా ప్లాస్టిక్ నిషేధం
- జిల్లా అంతటా యథేచ్ఛగా విక్రయాలు
- తగ్గుముఖం పట్టని వినియోగం



6లో

ఆలోచింపజేసిన నాటికలు

6లో



భూమి ఆన్‌లైన్‌కు లంచం అడిగారని..

- రైతు ఆత్మహత్యాయత్నం
- నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఘటన

7లో



పాలిథిన్ కవర్లు... ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ప్రకటనలకే పరిమితమవుతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల పాలిథిన్ కవర్లు వినియోగించకూడదని అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే అంతకంటే తక్కువ మందం గల పాలి'థిన్' కవర్లే మార్కెట్లో అధికంగా కనిపిస్తున్నాయి. ఇటు అధికారులు.. అటు ప్రజలు వీటికి దూరంగా ఉండే చర్యలు చేపట్టడం లేదు.





చీపురుపల్లిలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తున్న అధికారులు (ఫైల్)

మన చుట్టూ పాలిథిన్ కవర్లే!

- తూతూ మంత్రంగా ప్లాస్టిక్ నిషేధం
- జిల్లా అంతటా యథేచ్ఛగా విక్రయాలు
- తగ్గుముఖం పట్టని వినియోగం

చీపురుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచుల విక్రయం.. వినియోగాలపై విధించిన నిషేధం నీరుగారిపోతోంది. వీటిపై జిల్లాలోని మున్సిపాలిటీలు, మేజరు పంచాయతీలు జారీ చేసిన ఉత్తర్వులు ఎక్కడా అమలు కావడం లేదు. పట్టణాలు.. మారుమూల పల్లెల్లో సైతం ఇప్పుడు పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి. పట్టణాలు, పంచాయతీల నుంచి సేకరిస్తున్న చెత్తలో దాదాపు 60 శాతం ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లే ఉంటున్నాయి. వాటిని విక్రయిస్తున్న దుకాణాలపై ప్రభుత్వ అధికారులు దాడులు చేసి.. జరిమానాలు వసూలు చేస్తున్నా.... విక్రయదారుల్లో మార్పు రావడం లేదు. పాలిథిన్ వినియోగం అత్యంత ప్రమాదకరమని స్వచ్ఛంద సంస్థలు... అధికారులు గొంతు చించుకుంటున్నా.... అవగాహనా ర్యాలీలు.. సదస్సులు నిర్వహిస్తున్నా వినియోగదారులు కూడా వాటిని దూరం పెట్టడం లేదు. వెరసి ప్లాస్టిక్ భూతం రోజురోజుకూ తన పరిధిని విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది.

బహిరంగంగా విక్రయం..

విజయనగరం నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో అధికారికంగా అక్కడి అధికారులు ప్లాస్టిక్‌పై నిషేధం విధించారు. మేజరు పంచాయతీల్లో కూడా వీటి విక్రయాలపై ఆంక్షలు విధించారు. 40 మైక్రాన్ల మందం దాటినవే వాడాలన్న నిబంధన పెట్టారు. జిల్లాలోని దాదాపు అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఈ నిబంధనను ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా గత ఐదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం దీనికి పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వకపోవడంతో, అధికారులు కూడా మొక్కుబడిగానే పని చేశారు. ఇప్పుడు మాంసం విక్రయ కేంద్రాలు, వస్త్ర, కిరాణా, జనరల్, కూరగాయల దుకాణాల్లోనూ వీటినే విరివిగా వినియోగిస్తున్నారు. పట్టణాల్లో హోల్‌సేల్ వ్యాపారులు వీటిని బహిరంగంగానే విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల రిటైల్ వ్యాపారులు వినియోగదారులకు చాటుమాటుగా ఇస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆదేశాలు వచ్చినప్పుడో... లేదా ప్లాస్టిక్ నిషేధంపై ఏ స్వచ్ఛంద సంస్థో కార్యక్రమం నిర్వహించిన రోజునో అధికారులు హడావిడిగా దాడులు చేసి.. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి నామమాత్రంగా ప్లాస్టిక్ సరుకులు స్వాధీనం చేసుకొని, తరువాత చేతులు దులుపుకుంటున్నారు.



రోడ్లపై పాలిథిన్ కవర్లు ఇలా..

నామమాత్రంగానే చర్యలు..

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలపై మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులు నామమాత్రంగానే కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దాడుల సమయంలో పట్టుబడిన సరుకు స్వాధీనం చేసుకొని.. అప్పటికప్పుడు తోచినంత జరిమానా విధించడం తప్ప... ఇతర చర్యలు లేకపోవడంతో వ్యాపారులు నిర్భయంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

అయోమయ పరిస్థితి..

ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో ఇప్పటి వరకూ స్పష్టమైన ఆదేశాలు లేవు. 2022లో జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల పాలకవర్గాలు దీనిపై నిషేధం ప్రకటించాయి. అప్పట్లో మున్సిపల్ అధికారులు, పోలీసులు విక్రయదారులపై కొరడా ఝుళిపించారు. జరిమానా విధించి, సరుకులు స్వాధీనం చేసుకున్నారు. ఆ నిషేధం కొన్ని రోజులు మాత్రమే అమలయ్యింది.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌పైనే ఆశలు..

రాష్ట్రంలో గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ అంశంపై పెద్దగా దృష్టి సారించలేదు. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో ప్లాస్టిక్ కట్టడి సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం అమలు చేస్తే, వీటి నిరోధం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ కార్పొరేషన్ ద్వారా ఇబ్బడిముబ్బడిగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టనుంది. దీనిలో భాగంగా ప్లాస్టిక్ నిరోధంపై దృష్టి పెట్టాలని విద్యావేత్తలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

● స్పష్టమైన ఆదేశాలు లేవు..

రాష్ట్ర స్థాయిలో దీనిపై స్పష్టమైన చట్టాలు, ఆదేశాలు లేవు. స్థానిక సంస్థలు ఎక్కడికక్కడ నిషేధం విధించడం వల్ల కొంత మేరకు కట్టడి చేయగలిగాం. 2022లో భోగాపురం మండలంలోని నందిగాం పంచాయతీని ఈ విషయంలో ఆదర్శంగా తీర్చి దిద్దాం. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా ప్రజల సహకారం ఉంటే నిషేధం తప్పక విజయవంతమవుతుంది.

-ఇప్పలవలస సురేష్, ఎంపీడీఓ, చీపురుపల్లి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దు

● ఎస్పీ మాధవరెడ్డి ● ముగిసిన వాలీబాల్ పోటీలు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, వినియోగం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి హితవు పలికారు. తోణాంలో శుక్రవారం పార్వతీపురం సబ్ డివిజనల్ స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలు కావద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి సమాచారాన్ని అందించి నియంత్రణకు సహకరించాలని కోరారు. సైబర్ మోసాలకు గురైతే 1930 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ప్రజలలో మరింత మమేకవడానికి చొరవ చూపాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.రామకృష్ణ, సాలూరు రూరల్, మక్కువ, పాచిపెంట ఎస్ఐలు నర్సింహమూర్తి, వెంకటరమణ, వెంకట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



దిగువ మెండంగి జట్టుకు బహుమతి అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

వాలీబాల్ విజేత దిగువ మెండంగి

పార్వతీపురం సబ్ డివిజనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా సాలూరు మండలం దిగువ మెండంగి జట్టు నిలిచింది. మక్కువ మండలం కోన జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ పోటీలలో మొత్తం 114 వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఎస్పీ మాధవరెడ్డి బహుమతులు అందజేశారు.



వాలీబాల్ ఫైనల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



ఆలోచింపజేసిన నాటికలు

కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

నెలిమర్ల ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేట గ్రామంలో ఆరిపాక బ్రహ్మానందం స్మారక రెండు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఆలోచింపజేశాయి. శుక్రవారం మొదట శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు 'కొత్త పరిమళం' నాటికను ప్రదర్శించారు. ఆ తర్వాత విశాఖ పట్టణానికి చెందిన సౌజన్య కళా స్రవంతి (ఉత్తరాంధ్ర) కళాకారులు 'దేవరాగం' నాటికను ప్రదర్శించారు. సందేశాత్మకంగా సాగిన ఈ నాటికలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ కళాకారులు ప్రజల్లో జీవించి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -1 యూఎస్ఎన్‌మూర్తి, జనసేన నాయకులు లంక అప్పలనాయుడు, జనా ప్రసాద్, గ్రామ పెద్దలు ఎంఎం నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, కాళ్ల రాజశేఖర్, అవనాపు మురళీకృష్ణ, డొంక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవరాగం నాటికలోని దృశ్యం



యంత్రాలతో చెట్టును తరలిస్తున్న దృశ్యం

అమ్మవారి పండుగకు సిరిమాను చెట్టు సిద్ధం

సాలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సుమారు 14 సంవత్సరాల తర్వాత నిర్వహించనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండుగలో ప్రధాన ఘట్టమైన సిరిమాను ఉత్సవానికి సంబంధించిన చెట్టును శుక్రవారం సేకరించారు. అనువంశిక ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసిరాజు (యువరాజు), జన్ని కుటుంబీకులు పూజారి ధనుంజయ రావు, అల్లు, కర్రి కుటుంబ సభ్యులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆర్సీఎం పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టును అక్కడి నుంచి తీసి యంత్రాలతో సమీపంలో ఉన్న నీటి పారుదల కార్యాలయం వద్దకు చేర్చారు. ఈ నెల 23న సిరిమాను చెట్టును పట్టణంలో ఊరేగిస్తారు. శ్యామలంబ అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా శివాజీ బొమ్మ జంక్షన్‌కు చేరుకొని... అక్కడి నుంచి బోసు బొమ్మ కూడలి, డబ్బి వీధి, పెదకోమటిపేట, కోట దుర్గమ్మ గుడి జంక్షన్, ఎన్టీఆర్ విగ్రహం మీ దుగా అల్లువీధి రామ మందిరం వద్దకు చేర్చుతారు. చెట్టు సేకరణ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారరావు, సిగడాపు బంగారయ్య, మండల ఈశ్వరరావు, డబ్బి కృష్ణ, నకెళ్ల వెంకటరమణ, కారేపు చంద్ర, బృందావనం అశోక్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

● శతాబ్ది ఉత్సవాల నిర్వహణ

బొబ్బిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని అగ్రహారం వీధిలో గల దాసాంజనేయ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠతో పాటు శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో భక్తుల సహకారంతో పునర్నిర్మించారు. వేదపండితులు పీసపాటి రామకృష్ణన్, సంపత్‌కుమార్ శిష్య బృందంతో ఉత్సవాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం తిరువీధి, హోమం, పలువురు దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు. బాలికలు, మహిళలు కోలాటంతో కలశాల ఊరేగింపు నిర్వహించారు. శనివారం ధాన్యాధివాసం, నిత్యహోమాలు, ఆదివారం దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు పుల్లెల శ్రీనివాసరావు, కొత్తకోట సునీల్ కుమార్, పులగం మాధవీలత తెలిపారు. పునర్నిర్మించిన ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మూడు రోజుల ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం కమిటీ ప్రతినిధులు దీక్షలు చేపట్టారు. తొలిరోజు ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హోమం చేస్తున్న వేదపండితులు



భక్తుల కోలాటం

బంగారం భయపెడుతోంది

● వెండిదీ అదే దారి
● రూ.లక్ష మార్కు దాటిన వైనం



విజయనగరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి ధరలు నువ్వా? నేనా? అన్నట్టుగా పరుగెడుతున్నాయి. ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకున్నాయి. బులియన్ మార్కెట్‌లో వెండి, బంగారం ధరలు పోటాపోటీగా పరుగులు పెడుతున్నాయి. వెండి కిలో ధర రూ.లక్షకు చేరి... బంగారం సరసన నిలిచింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన వెండి ధర కిలో రూ.88,400 ఉండగా... కేవలం 50 రోజుల్లో కేజీపై రూ.11వేల 600 పెరిగి శుక్రవారం నాటికి రూ.లక్షకు చేరింది. బంగారం ధర గత నెలలో 10 గ్రాములు రూ.80వేలకు చేరింది. జనవరి నుంచి ఈ ధరలు పెరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. బంగారం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. అప్పటి నుంచి పెరుగుతూ 10 గ్రాముల ధర శుక్రవారం నాటికి రూ.88,040కి చేరింది. తులం ధర రూ.లక్షా 3వేలకు చేరుకుంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారు ఆభరణాల ధర రూ.80,700కు చేరుకుంది. ఈ ధరలు ఇలా విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసుకున్న మదుపరులు మాత్రం సంతోషంగా ఉన్నారు.

సంగీత, నృత్య కళాశాలకు ఘన చరిత్ర

● ఏపీ సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల దేశంలోనే ఎంతో ఘన చరిత్ర కలిగినదని ఏపీ సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి అన్నారు. శుక్రవారం ఆమె ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తేజస్వి మాట్లాడుతూ ఈ కళాశాలకు తొలి, ద్వితీయ ప్రధానోపాధ్యాయులుగా ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు బాధ్యతలు వహించారన్నారు. సంగీత కళాశాలకు చంద్రబాబు సీఎంగా గతంలో నిధులు మంజూరైన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. 2019 నుంచి 2024లో అధికారం లోకి వచ్చిన వైసీపీ దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ సంగీత కళాశాల విద్యార్థులకు సింహాచలం దేవ స్థానం విజయనగరంలో నిర్వహించే చౌల్ట్రీలో భోజనాలు పెట్టేవారని, వైసీపీ హయాంలో విద్యార్థులకు భోజనం కూడా ఏడాదిన్నర లేకుండా చేశారన్నారు.



సంగీత, నృత్య కళాశాలను సందర్శించిన ఏపీ సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

బాలేరులో విగ్రహాల ప్రతిష్ఠ

భామిని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేరు చెవిటమ్మతల్లి గ్రామ దేవత ప్రాంగణంలో విగ్రహాల ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు బాల భాస్కరశర్మ ఆధ్వర్యంలో చెవిటమ్మ తల్లి, దుర్గాదేవి, శివుడు విగ్రహాలను ప్రతిష్ఠించారు. బాలేరు, సోలికిరి, తాలాడ, ఒడిశా, ఇదుడి తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు సామూహిక పూజలు నిర్వహిస్తూ విగ్రహాలను దర్శించుకున్నారు. అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు.



ప్రతిష్ఠించిన శివుని విగ్రహం

శ్మశానాల అభివృద్ధికి అడుగులు

● నిధుల కోసం ప్రతిపాదనలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చివరి మజిలీలో కష్టాలకు తెరపడనుంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోని శ్మశానాల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో ఉపాధిహామీ నిధులతో శ్మశానాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే నాలుగు మండలాలలో ఎక్కడెక్కడ అభివృద్ధి చేయాలనే అంశంపై మండల పరిషత్ అధికారులు ఓ నిర్ణయానికొచ్చారు. కుటుంబంలోని సభ్యుడు మరణించాడన్న బాధకన్నా మృతదేహాన్ని ఎక్కడ ఖననం చేయాలన్న దుస్థితి రాజాం నియోజకవర్గంలోని రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలలో నెలకొంది. ఈ పరిస్థితుల్లో శ్మశానాలలో షెడ్ల నిర్మాణంతో పాటు గ్రావెల్ రహదారుల నిర్మాణం కోసం అంచనాలు రూపొందించారు. నాలుగు మండలాలలోని ఏయే గ్రామాలలో శ్మశానాలను అభివృద్ధి చేయాలనే అంశాలపై అధికారులు నివేదిక సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు చెందిన శ్మశానాలలో కనీస సదుపాయాలు లేవనే చెప్పాలి. చాలా గ్రామాల్లో శ్మశానాలు సైతం ఆక్రమణలకు గరయ్యాయి. కొన్ని చాలీచాలని స్థలాలు ఉండగా, మరికొన్ని గ్రామాలలో రహదారులు లేక, చిన్నపాటి వర్షం కురిసినా అంత్యక్రియం చేసేందుకు ఇబ్బందులు పడే పరిస్థితులున్నాయి. దీంతో గ్రామాలలో పడుతున్న ఇక్కట్లను నాయకులు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకొచ్చారు. ఫలితంగా స్పందించిన ఎమ్మెల్యే అంచనాలు తయారుచేసి జిల్లా పరిషత్‌కు పంపించాలని ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. దాంతో అధికారులు అంచనాలు తయారు చేసి జడ్పీకి పంపించారు. జడ్పీలో ఆమోదం పొం దాక కలెక్టర్ ఆమోదిస్తే నియోజకవర్గంలో శ్మశానాల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

నాలుగు మండలాలలో..

నియోజకవర్గంలోని రాజాం మండలంలో 59 పనులకు గాను రూ.2.79 కోట్లు, వంగర మండలం లో 117 పనులకు గానూ రూ.4.62 కోట్లు, రేగిడి మం డలంలో 50 పనులకు గాను రూ.250 కోట్లు, సంతకవిటి మండలంలో 58 పనులకు గానూ రూ.3.75 కోట్లు నిధులు అవసరమని అధికారులు నివేదించారు.



వస్త్రపురి కాలనీ శ్మశానవాటికకు వెళ్లే దారి ఇదే..

నిధులు రాగానే..

ఉపాధిహామీ పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామాలలో శ్మశానాల అభివృద్ధి కోసం అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయ్యాక షెడ్లు, గ్రావెల్ రహదారులు ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తాం.

-వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో, రాజాం

రామాలయానికి భూమి పూజ

చీపురుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికాయవలసలో రామాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామీజీ నేతృత్వంలో పురోహితులు నేతేటి బాలసూర్య సుబ్రహ్మణ్యశర్మ, కృష్ణశర్మ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ దన్నాన లక్ష్మి, శ్రీరాములు దంపతులు కొబ్బరికాయ కొట్టి భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దన్నాన పద్మావతి, సత్యారావు, దన్నాన శంకరరావు, మీసాల సిమ్మినాయుడు, బాలి వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 21 (ఆం ధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేట 33 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. సింగపూర్ సిటీ, జమ్మునారాయణపురం, పడాలపేట, ఆనందపురం, బ్యాంకు కాలనీ, తాడివాడ, సీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మరుగుదొడ్లు మంజూరు

వంగర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్టు ఎంపీడీవో త్రినాథరావు తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అత్యవసర వేళల్లో ఎక్కడికెళ్లేది?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మరుడుదొడ్ల నిర్మాణాలకు రూ 2.50 లక్షలను మంజూరు చేశారు. అలాగే మండల విద్యావనరుల కేంద్రంలో మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు విడుదలైనట్టు ఎంపీడీవో తెలిపారు.

లింగ నిర్ధారణ నేరం

ంధ్రజ్యోతి):లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో సత్యవాణి హెచ్చరించారు. లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టం-1994 పక్కాగా అమలయ్యేలా కమిటీ అప్రమత్తంగా ఉండాలని కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో డివిజన్ స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్య ఉపశాఖాధికారి డా. సూర్యనారాయణ, సీఐ జి.శంకరరావు, ఆర్డీవో కార్యాలయం ఏవో ఈశ్వరమ్మ, చిన్నతల్లి, ఎం.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డా.ఖలీల్‌బాబుకు అవార్డు

విజయనగరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చక్రవర్తి డాక్టర్ ఖలీల్ బాబుకు డీన్‌వాంగ్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ సంస్థ ఆధ్యాత్మిక శాస్త్రవేత్త అవార్డుతో సత్కరించారు. బాబామెట్టలోని దర్గాలో ఖలీల్ బాబుకు జ్ఞాపికతో కూడిన ప్రశంసాపత్రాన్ని సంస్థ ప్రతినిధులు అందజేశారు.

5 వేల పెన్నుల పంపిణీ

చీపురుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 1998 బ్యాచ్ ఉపాధ్యాయుడు కిల్లంశెట్టి సన్యాసిరావు, తన తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు కె.ఆంజనేయులు జ్ఞాపకార్థం విద్యార్థులకు 5 వేలు పెన్నులు పంపిణీ చేశారు. శుక్రవారం పెన్నులకు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌కుమార్ ఉన్నారు.

అలరించిన ఎడ్ల పందెం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపేటలో శుక్రవారం దుర్గమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా ఎడ్ల బండ్ల పోటీలు జరిగాయి. ఇందులో మరిడి మాంబ వావిలపాడు బండి మొదటి స్థానం సాధించింది. గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

భూ ఆధార్ నిలిపివేయండి

మెంటాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భూ ఆధార్ నిలిపివేయాలని గిరిజన సంఘ నేతలు డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కొత్తవలస, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీకి చెందిన క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు మండలంలోని కంటకాపల్లిలోని శారదా కర్మాగారం ఆర్థిక సాయంతో జరుగుతునా వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి. సూరిబాబు తెలిపారు.

టీ20 క్రికెట్ చాంప్ విజయనగరం



ట్రోఫీ అందుకుంటున్న విజయనగరం జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్ లో జరిగిన 11వ యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ ట్రోఫీని విజయనగరం జిల్లా క్రికెట్ సంఘం కైవసం చేసుకుంది. కవలియర్స్ సిసి (విశాఖ) రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో విజయనగరం 57 పరుగుల తేడాతో కవలియర్స్‌ను చిత్తు చేసింది. తొలి బ్యాటింగ్ చేసిన విజయనగరం నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. ఓపెనర్లు గుల్షామ్ సాలే (18), దుర్గాకుమార్ (22) శుభారంభం ఇవ్వగా, మిడిల్ ఆర్డర్‌లో సందీప్ హాఫ్ సెంచరీ (55), తపస్వి (21), రవికిరణ్ (38), ధీరజ్‌కుమార్ (37) ధాటిగా స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కవలియర్స్ బౌలర్లలో భువనేశ్వర్, సాయిశ్రావణ్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్య సాధనలో కవలియర్స్ 19 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. కెఎస్‌ఎన్.రాజు అర్ధ సెంచరీతో (71) రాణించగా, వర్ధన్ (19) కాస్త తోడ్పాటు ఇచ్చాడు. మిగిలిన బ్యాటర్లు తడబడి వరుసగా వికెట్లు సమర్పించుకుని పెవిలియన్ దారి పట్టారు. ఎనిమిది బ్యాటర్లు రెండంకెల స్కోరు కూడా చేయలేక పేలవమైన ఆటను ప్రదర్శించారు. విజయనగరం బౌలర్లలో తపస్వి మూడు వికెట్లు తీయగా, వై.వాసు, రవికిరణ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన రవికిరణ్ మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్‌గా నిలిచాడు. టోర్నీ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా వై.వాసు (విజయనగరం), బెస్ట్ బ్యాటర్‌గా కెఎస్‌ఎన్.రాజు (కవలియర్స్), బెస్ట్ బౌలర్‌గా డి.క్రాంతి (వైజాగ్ వెటరన్స్) అవార్డులందుకున్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏసీఏ మాజీ ఉపాధ్యక్షుడు జి.జె.జె.రాజు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సోనా డోనా సీఈవో కరణ్, యూసీసీ ప్రతినిధులు రమణమూర్తి, వెంకటేష్, శ్రీనివాస్, సోమేష్, రాంకీ, చైతన్య పాల్గొన్నారు. నగరంలోని స్వచ్ఛంద సంస్థలకు యూసీసీ ప్రతినిధులు రూ.లక్ష విరాళాన్ని అందించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం: జేసీ



పంటను పరిశీలిస్తున్న జేసీ

మెంటాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ మొక్కలు, బిందు సేద్యం పరికరాలను రైతులకు శతశాతం రాయితీపై అందజేస్తామని జేసీ సేతు మాధవన్ అన్నారు. శుక్రవారం పెదమేడపల్లిలో మహిళా రైతు రామలక్ష్మి వేసిన ఆయిల్‌పామ్ పంటను ఆయన పరిశీలించారు. పంట దిగుబడి, మార్కెటింగ్, ప్రస్తుత ధర, ఆయిల్‌పామ్‌లో అంతర పంట కోకో దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు శతశాతం, ఐదెకరాల పైనున్న రైతులకు 50 శాతం రాయితీలో బిందుసేద్యం పరికరాలు అందిస్తామన్నార కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి జమదగ్ని, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో భానుమూరి ఏవో గోకుల కృష్ణ పాల్గొన్నరు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రేవతి సిబ్బంది రైల్వేస్టేషన్ సమీపంలో నిఘా పెట్టారన్నారు. దాసన్నపేట దరి నవాబుపేటకు చెందిన బాసిన నవీన్, ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా కళ్యాణ్‌సింగుపూర్‌లోని గొల్లవీధికి చెందిన పాలక సంతోష్ గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపేటలో కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. వారినుంచి నాలుగు కోళ్లు, రూ.3,460 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పెందుర్తి పరిశీలకురాలిగా శ్రీలక్ష్మి

జామి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపాలెంకు చెందిన వెలమ కార్పొరేషన్ డైరక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మిని ఎమ్మెల్సీ ఎన్నికలకు పెందుర్తి నియోజకవర్గం పరిశీలకురాలిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

కొత్తవలసలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తవలస, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని మండల రెవెన్యూ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ అంబేడ్కర్ ఆకస్మికంగా సందర్శించారు. ఎవరినీ కార్యాలయంలోకి అనుమతించకుండా రికార్డులను తనిఖీలు చేశారు. కలెక్టర్ వచ్చారన్న సమాచారాన్ని బయటకు సిబ్బంది తెలియనివ్వలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడుస్తున్న బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లను తొలగించి కొత్తవారి పేర్లు నమోదు చేయక పోవడంపై సీరియస్ అయినట్టు తెలిసింది. రీసర్వే విషయంలో ఎటువంటి చిన్న తప్పిదం జరిగినా తీవ్రమైన చర్యలు ఉంటాయని సిబ్బందికి హెచ్చరించినట్టు సమాచారం. అయితే కలెక్టర్ ఎందుకు వచ్చారనే విషయంపై రెవెన్యూ సిబ్బంది నోరు మెదపని తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. ఏం జరిగి ఉంటుందనే చర్చ జోరుగా జరుగుతోంది.

గ్రూపు-2 అభ్యర్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

విజయనగరం కలెక్టరేట్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ పాయింట్స్ ప్రకటించిన తరువాత గ్రూపు -2 పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు శుక్రవారం రాత్రి కోట వద్ద ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వంలో పాయింట్లు ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. అప్పట్లో దీనిపై నిరసన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి రోస్టర్ ప్రకటించాకే పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీనిపై పెద్ద పోరాటం చేస్తామని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది, అధికారులు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన పోలీసు వేల్ఫేర్ డేలో భాగంగా సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలను పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వైసీపీ జిల్లా కార్యవర్గం ఇదే..

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా వైసీపీకి నూతన కార్యవర్గాన్ని రాష్ట్రశాఖ శుక్రవారం ప్రకటించింది. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) రెండు నెలల క్రితమే నియమించారు. మిగతా కార్యవర్గాన్ని ప్రకటించారు. కేంద్ర కమిటీ కార్యాలయం ఈ మేరకు నియామక పత్రాన్ని విడుదల చేసింది. నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా టెంకల అచ్చెంనాయుడు (రాజాం నియోజకవర్గం), చొక్కాపు లక్ష్మణరావు (బొబ్బిలి నియోజకవర్గం), పతివాడ అప్పలనాయుడు (నెల్లిమర్ల నియోజకవర్గం), ఎస్‌వీవీ రాజేశ్వరరావు (విజయనగరం), పాండ్రంకి సంజీవి (గజపతినగరం), శిరిపూరు వెంకట రామరాజు (చీపురుపల్లి), ముక్కాల కస్తూరి (ఎస్‌కోట), ప్రధాన కార్యదర్శులుగా వర్రి నర్సింహమూర్తి గజపతినగరం), అల్లాడ సత్యనారాయణమూర్తి (నెల్లిమర్ల), ఇప్పిలి ఆనంత్ (చీపురుపల్లి), సంగంరెడ్డి బంగారునాయుడు (విజయనగరం), తమ్మిరెడ్డి దామోదరరావు (బొబ్బిలి), కోశాధికారిగా సిరిపురపు జగన్మోహన్‌రావు (రాజాం)లను నియమించారు.

కళాను పరామర్శించిన ఎన్ఈఆర్

రాజాం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును శుక్రవారం రాత్రి రాజాం క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుంటి ఈశ్వరరావు కలిశారు. కళా సోదరుడు కిమిడి సత్యనారాయణనాయుడు ఇటీవలమరణించిన విషయం తెలుసుకుని కళా క్యాంపు కార్యాలయానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం రాజకీయ పరిస్థితులపై ఇరువురూ చర్చించుకున్నారు.

రఘువర్మకు ఓటు వేయించండి



విజయనగరం: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదితి



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా



నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు నజీర్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటుని రఘువర్మకు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కస్పా హైస్కూల్‌లో ఎన్నికల పరిశీలకురాలు ఇందుకూరి సుబ్బలక్ష్మీరాజుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

●రాజాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను శుక్రవారం టీడీపీ సీనియర్ నాయుకుడు కోండ్రు జగదీశ్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ కోళ్ల అప్పనాయుడు కలిశారు.

●నెల్లిమర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించేందుకు టిడిపి శ్రేణులు కృషి చేయాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నజీర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమావేశం పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అధ్యక్షతన జరిగింది. రఘువర్మను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు పాండ్రంకి జయరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు పాల్గొన్నారు.

●గజపతినగరం: ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, సీనియర్ నాయకులు పీవీవీ గోపాలరాజు కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించి రఘువర్మకు మద్దతు ప్రకటించాలని కోరారు.

●చీపురుపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించడానికి నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విజ్ఞప్తి చేశారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన ముఖ్య నాయకులతో శుక్రవారం మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై తన గళాన్ని బలంగా వినిపించగల సత్తా ఉన్న రఘువర్మకు నాయకుంతా మద్దతివ్వాలని ఆ యన కోరారు. సమావేశంలో రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, తాడ్డి సన్యాసి నాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు ఉన్నారు.

భూమి ఆన్‌లైన్‌కు లంచం అడిగారని..

రైతు ఆత్మహత్యాయత్నం

● నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఘటన



పురుగు మందు తాగేందుకు యతిస్తున్న రైతు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఓ రైతు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. తన భూమిని ఆన్‌లైన్ చేయాలని దరఖాస్తు చేసి కొన్నేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో చివరకు ఆత్మహత్యకు చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. పని పూర్తి కావాలంటే రూ. లక్షలు ఇవ్వాలనే వీఆర్వోతో డిమాండ్ చేయడంతోనే తానీ నిర్ణయం తీసుకున్నట్లు బాధితుడు తెలిపాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుషిణి పంచాయతీ చనమల్లుపేట గ్రామానికి చెందిన రైతు చనమల్లు అబద్ధంకు అదే గ్రామంలో 126, 127, 131, 202 తదితర సర్వే నెంబర్లలో 1.60 ఎకరాల భూమి ఉంది. అందుకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన భూముల వివరాలేవీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దాంతో భూమి అమ్మకానికి, రుణాల సదుపాయానికి వీలు కావడం లే దు. 2020 అక్టోబరు 15న తన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు చేసి నాలుగేళ్లు పూర్తయినా పనికాలేదు. సదరు రైతుల భూమికి సంబంధించి ఎలాంటి వివాదాలు, అడ్డంకులు లేవని తెలుస్తోంది.

పురుగు మందు డబ్బా తెచ్చుకుని...

శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఎప్పటిలాగానేతహసీల్దార్ కార్యాలయానికి అబద్ధం చేరుకున్నాడు. ఆయనతో పాటు కుటుంబసభ్యులు వచ్చారు. రెవెన్యూ కార్యాలయంలో తన పనికావడం లేదని భోరున విలపిస్తూ అకస్మాత్తుగా తన సంచిలోని పురుగు మందు డబ్బా తెరిచి తాగేందుకు ప్రయత్నించాడు. దీంతో కుటుంబీకులు, అక్కడ ఉన్న వారు డబ్బాను లాక్కుని ఆయన ప్రాణాలను కాపాడారు. అదే సమయంలో ఆయనతో పాటు కుమారుడు, కుమార్తె, సోదరుడు కూడా అక్కడే ఉన్నారు. ఈ విషయం తెలిసి అక్కడకు చేరుకున్న విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. తన భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నా గుషిణి వీఆర్వో రెడ్డి గోవింద్ పని కాకుండా దాటవేస్తున్నాడన్నారు. గట్టిగా నిలదీస్తే రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. అందుకే తాను చనిపోయేందుకు నిర్ణయించుకున్నానన్నాడు. తండ్రి ఆత్మహత్యకు యత్నించడంతో కుమారుడు, కుమార్తె భోరున విలపించారు. వారు మాట్లాడుతూ మా భూమిని మా పేరున ఆన్‌లైన్ చేసేందుకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. లంచం డిమాండ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నం ఘటన అనంతరం అబద్ధం కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయంలోనికి వెళ్లి వీఆర్వో గోవింద్‌ను, సిబ్బందిని నిలదీశారు. వీఆర్వో రెడ్డి గోవింద్‌ను వివరణ కోరగా తాను ఇక్కడ వీఆర్వోగా బాధ్యతలు చేపట్టి కేవలం రెండు నెలలే కావస్తోందన్నారు. అబద్ధం పెట్టుకున్న దరఖాస్తు నా దృష్టికి రాలేదని అన్నారు. తాను లంచం అడిగిన మాట అవాస్తవమన్నారు. ఈ ఘటనపై తహసీల్దార్ బి.సుదర్శనరావు వివరణ కోరగా.. వీఆర్వో లంచం కావాలని అడిగాడనే విషయంపై తాను విచారణ చేయిస్తానన్నారు.

రైలు నుంచి జారి పడి వృద్ధుడి మృతి

చీపురుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. ఒంటిపై తెలుపు రంగు గళ్ల చొక్కా ఉంది. మృతుడి జేబులో శ్రీకాకుళం నుంచి సికింధరాబాద్ వరకూ జనరల్ టికెట్ ఉన్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో..

డెంకాడ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.రాజు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. పినతాడివాడ గ్రామానికి చెందిన రాజు గురువారం రాత్రి పెదతాడివాడలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. గాయాలపాలైన రాజును విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువతి..

నెల్లిమర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లకు చెందిన దేవిప్రియ (26)అనుమానాస్పదస్థితిలో శుక్రవారం మృతి చెందారు. ఆమె తన భర్తతో కలిసి విజయనగరం ఫూల్‌బాగ్ కాలనీలో నివాసం ఉంటుంది. మృతి చెందిన దేవిని తన భర్త స్వగ్రామమైన నీలంరాజుపేట తీసుకుని వచ్చారు. ఈ విషయం దేవి కుటుంబీకులు తెలియడంతో ఆమె మృతిపై అనుమానం ఉందని విజయనగరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఏడాది జైలు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో 2019 లో నమోదైన పోక్సో కేసులో వ్యక్తికి న్యాయస్థానం ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమాన విధించిందని ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.కోటలోని ఒక పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని వెంటపడి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్నారు. కేసుకు సంబంధించి సీఐ నారాయణమూర్తి సాక్ష్యాధారాలను సమర్పించడంతో పోక్సో కోర్టు న్యాయాధికారి కె.నాగమణిపై శిక్ష ఖరారు చేశారని ఎస్పీ పేర్కొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

గరివిడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండదాడి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎంటీఎస్ ఉపాధ్యాయుడు కొరజాన రమణారావు (55) శుక్రవారం గుండెపోటుతో పాఠశాల ప్రాంగణంలో మృతి చెందాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన రమణారావు పాఠశాలలోని బాత్‌రూంలోకి వెళ్లి కాలుజారిపడి అక్కడిక్కడే గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడు మండలంలోని సేరీపేట గ్రామానికి చెందినవారు.

భూములు మారుతున్నాయ్‌!

(ఐదో పేజీ తరువాయి)

కన్వర్షన్‌కు దరఖాస్తులు చేసు కుంటున్నారు. కన్వర్షన్ చేసిన తరువాత గజాలు లెక్కన ప్రభుత్వం పరిహారం ఇస్తుందని రైతుల ఆలోచన. ఎక్కువగా విజయనగరం డివిజన్‌లోని విజయనగరం, గంట్యాడ, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, ఎస్.కోట, జామి, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాల నుంచి ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. ఈ డివిజన్ పరిధిలో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం, విశాఖ నుంచి రాయిపూర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ ఏర్పాటు, వివిధ రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే, భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారం తక్కువగా ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో పరిహారం పెంచుకునే దానిపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. విజయనగరం డివిజన్‌లో గత మూడేళ్లలో 2,849 ఎకరాల వ్యవసాయ భూమి వ్యవసాయేతరగా మారింది. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.17కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, గతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్లు చాలా వరకూ కన్వర్షన్ చేయకుండా ఉన్నాయి. వీటిల్లో ప్లాట్లు కొనుగోలు చేసుకున్నవారు ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది పడుతున్నారు. కన్వర్షన్ లేకపోవడంతో సంబంధించిన పంచాయతీలు గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు.

ల్యాండ్ కన్వర్షన్ ఇలా చేసుకోవాలి..

వ్యవసాయ భూమిని వాణిజ్యానికి వినియోగించుకోవాలంటే ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాలి. వ్యవసాయ భూమిలో వెంచర్లు వేయాలన్నా, పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా, ఇతర అవసరాలకు వినియోగించాలన్నా ముందుగా భూ మార్పిడి చేయాలి. భూమి కొనుగోలు చేసినప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన ఫీజులో 5 శాతం ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లించాలి. మార్పిడి చేయనున్న భూమికి సంబంధించిన పత్రాలతో మీసేవ, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ భూమి ప్రైవేటుదా? ప్రభుత్వానికి చెందినదా? అనేది అధికారులు పరిశీలిస్తారు. పత్రాలన్నీ పక్కగా ఉంటే సంబంధిత ఆర్డీవోకి నివేదిక పంపిస్తారు. ఆయన మరోసారి వెరిఫికేషన్ చేస్తారు. భూపత్రాలు అన్ని సక్రమంగా ఉంటే వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ ధ్రువపత్రం జారీ చేస్తారు.

గజపతినగరంలో దొంగల బీభత్సం

(ఐదో పేజీ తరువాయి)

గుర్తిస్తామన్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు బీట్ విధులు నిర్వహిస్తున్నారని, త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు. కాగా, రాత్రి సమయాల్లో బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల కళ్లు గప్పి దొంగలు చోరీకి పాల్పడడం గమనార్హం. పోలీసుల వైఫల్యం కారణంగానే దొంగతనం జరిగినట్లు పట్టణవాసులు చెబుతున్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి: మంత్రి కొండపల్లి

గజపతినగరం పట్టణంలో జరిగిన చోరీకి సంబంధించి సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎస్పీని ఆదేశించారు. బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేయాలని తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతులకు నష్టం లేకుండా చర్యలు

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టం వాటిల్లకుండా ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఉల్లిభద్ర సముదాయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే రైతులకు తగిన గుర్తింపుతో పాటు భరోసా ఉంటుందన్నారు. కాయగూరలు సాగు చేస్తున్న రైతులకు తగిన మద్దతు ధర అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు ప్రత్యేక కృషి చేస్తున్నారని చెప్పారు. టమాటా రైతులు నష్టపోకుండా పంటను వేరే ప్రాంతాలకు సరఫరా చేసి, తగిన ధర అందేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తక్కువ ధర పలుకుతున్న జిల్లాల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుబజార్లకు సరఫరా చేస్తుందని ఆమె తెలిపారు. రోజువారీ వెయ్యి క్వింటాళ్ల కొనుగోలుకు చర్యలు చేపడుతుందన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లకు టమాటాను తరలించి తగిన గిట్టుబాటు ధర అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల నుంచి టమాటా సేకరణ

సాలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి లో ఈనెల 19న బుధవారం టమాటా ధర పతనం అనే శీర్షికతో వచ్చిన కథనానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. మంత్రి ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు దుగ్గసాగరంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. రైతులు పండించిన టమాటాలను కొనుగోలు చేసి, అక్కడ నుంచి విశాఖ పట్నం, సీతమ్మధర, ఎంవీపీ కాలనీలలో ఉన్న రైతు బజార్లకు పంపినట్టు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తెలిపారు.

బజార్లకు పంపిస్తాం

సాలూరు/పార్వతీపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సాలూరులో టమాటా పంటకు గిట్టుబాటు ధరపై మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకున్నట్టు జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.శ్యామల తెలిపారు. ఈనెల 19వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దుగ్గసాగరంలో 80 ఎకరాల్లో టమాటా పంటను సాగు చేస్తున్నారని ఆమె చెప్పారు. సంకర జాతి కూరగాయాలు సాగు పథకంలో టమాటా రైతులకు పెట్టుబడి రాయితీ అందించామన్నా రు. రైతులు నవంబరు నెలలో మొదటి కోత నుంచి జనవరి నెల వరకు కిలో రూ.25 నుంచి రూ.8 ధర పొందారని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫిబ్రవరి 11 నుంచి టమాటా ఉత్పత్తి డిమాండ్‌కు మించి అధిక దిగుబడి వచ్చినందుకు ధర గణనీయంగా తగ్గిందని ఆమె స్పష్టం చేశారు. పంట ను పరిశీలించి వివిధ రైతు బజార్లకు పంపిస్తామని ఆమె తెలియజేశారు.

సాగునీటి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించాలి

పాలకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల నాయకుడు దావాల రమణారావు మాట్లాడారు. ఝంజావతి, అడారిగెడ్డ, పెద్దగెడ్డ, వెంశరాయి, తోటపల్లి, గుమ్మడిగడ్డ, పాలగడ్డ, జంపరకోట తదితర ప్రాజెక్టులకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలో పీజీ కళాశాల, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి ఉన్నత చదువులు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు కె.రాము, లక్ష్మణరావు, రమేష్, హారిక, భానుచంద్ర, చంప తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించండి

సాలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ చదువుతున్న విద్యార్థులు శుక్రవారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని తన నివాసంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ బకాయి ఫీజులు కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. మంత్రి స్పందించి ఫీజు రీయంబర్స్‌మెంట్ వచ్చేలా చేస్తామని తెలిపారు.

షట్టర్లు ఇలా.. సాగునీరు ఎలా?

● సాయన్న చానల్ రైతులకు తప్పని అవస్థలు
● కూటమి ప్రభుత్వంపై ఆశలు

రేగిడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్నది సాయన్న చానల్ హెడ్ రెగ్యులేటర్ పెద్దపుని. రేగిడి మండలం సంకిలి వద్ద దీని హెడ్ ఉంది. ఇలాంటి హెడ్ రెగ్యులేటర్లు ఈ చానల్ పరిధిలో సంకిలి, రేగిడి, చెలిగానవలస వద్ద మరో నాలుగైదు చోట్ల ఉన్నాయి. ఈ చానల్.. రేగిడి, సంతకవిటి మండలాల్లో 12వేల ఎకరాల ఆయకట్టుకు జీవనాధారం. ఇటువంటి కీలక చానల్‌కు గత కొన్నాళ్లుగా కొత్త షట్టర్లు మంజూరు కాలేదు. ఉన్నవి నాలుగైదు చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో స్థానిక రైతులు తాత్కాలిక మరమ్మతులు, అడ్డుకర్రలతో సాగునీరు మళ్లించుకుంటున్నారు. స్థానిక రైతులు, సంకిలి నీటి వినియోగ సంఘం అధ్యక్షుడు నారు జనార్ధనరావు ఈ సమస్యను ఇటీవల రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాయన్న చానల్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యింది. కూటమి ప్రభుత్వం లోనైనా సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను ఎప్పుడు అడిగినా ప్రతిపాదనలు పంపాం, నిధుల రావల్సి ఉందని చెబుతున్నారని స్థానిక రైతులు వాపోతున్నారు.



శిథిలావస్థలో పెద్దపుని షట్టర్లు, సంకిలి వద్ద పాడైన మరో రెగ్యులేటర్ తలుపులు

దీనస్థితిలో ఇరిగేషన్ కార్యాలయం

బొబ్బిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఉమ్మడిగా ఉండే బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం నేడు దీన స్థితికి చేరుకుంది. ఈ సర్కిల్ నుంచి శ్రీకాకుళం జిల్లాకు వేరుగా సర్కిల్‌ను విభజించారు. దీంతో ఈ కార్యాలయం ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యుత్ నిలిచిపోతే కొవ్వొత్తులు వెలిగించి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరు ఆర్.అప్పారావు కొవ్వొత్తు వెలుగులో విధులు నిర్వహించడం కనిపించింది. ఇన్వర్టర్ పాడవడంతో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. దీనిపై ఎస్ఈ అప్పారావును వివరణ కోరగా, ఇటీవల బాధ్యతలు స్వీకరించానని, సోలార్ యూనిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వార్డుల్లో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య నిర్వహణలో ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె కోరాడ వీధి సచివాలయం పరిధిలో గల పలు వీధుల్లో పర్యటించారు. కాలువల్లో సిల్ట్‌ను, రోడ్లపై చెత్తను తొలగించాలన్నారు. సంఘ వీధి సామాజిక మరుగుదొడ్డి ముందు అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలంతా నీటిని పొదుపుగా వినియోగించాలని ఆమె సూచించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని వినతి

పాలకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగవాడ నుం చి రుద్రిపేట గ్రామానికి రహదారి నిర్మించాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, ఖండాపు ప్రకాష్, ఖండాపు చైతన్యకుమార్ కోరారు. ఈమేర కు శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రోడ్డు కోసం రూ.45 లక్షలు మం జూరు చేసినా నేటికీ పనులు జరగలేదన్నారు. అలాగే 1200 ఎకరాలకు సాగునీరు అందించే నరసింహచెరువు పూడికలు తొలగించాలని కోరారు.

రఘువర్మ గెలుపునకు కృషి చేయాలి



కూటమి పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మ గెలుపు కోసం కూటమి శ్రేణులంతా శ్రమించాలని ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. శుక్రవారం బొబ్బిలి కోటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘువర్మ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని శ్రమించాలన్నారు. పార్టీ నాయకులు రౌతు రామ్మూర్తి, రాంబార్కి శరత్‌బాబు, పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన పాకలపాటి రఘువర్మకు మద్దతుగా బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఆర్వీ భంజ్‌దేవ్‌లు కలిసి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. రఘువర్మకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వంట నూనెపై రైతులకు అవగాహన

బొబ్బిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నూనె గింజలను పండించే అంతర్ జిల్లా రైతులను అధికారులు బొబ్బిలి గ్రోత్‌సెంటరులోని వంటనూనె తయారీ పరిశ్రమ సందర్శనకు శుక్రవారం తీసుకొచ్చారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ (ఎన్ఎంఈవో) పథకంలో భాగంగా పథకం సాంకేతిక సహాయకులు సీహెచ్ ప్రసూనా రాణి ఆధ్వర్యంలో జీఎల్‌పురం, కురుపాం, కొమరాడ మండలాలకు చెందిన రైతులను బొబ్బిలి తీసుకొచ్చారు. నువ్వులు, వేరుశనగ పండించే రైతులకు నూనె తయారీపై అవగాహన కల్పించడమే మార్కెటింగ్ సదుపాయాలపై పరిజ్ఞానం కలిగించేందుకు వారిని తీసుకొచ్చినట్టు తెలిపారు. మన్యం జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఉన్న రైతులు పండించే నూనె గింజల ఉత్పత్తులను ఎటువంటి మధ్య దళారీల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచి మంచి ధరకు కొనుగోలు చేయాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ఇందుకు కంపెనీ నిర్వాహకులు సానుకూలంగా స్పందించారు. వంట నూనెలను గింజల నుంచి ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేస్తున్న ప్రక్రియను రైతులు ఆసక్తిగా తిలకించారు.

క్షయ పరీక్షలు చేయించుకోవాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): క్షయ లక్షణాలు ఉన్నవారంతా వెంటనే కఫం పరీక్షలు చేయించుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డా.ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి మందగించినా, బరువు తగ్గినా తదితర లక్షణాలు ఉంటే నిక్షయ్ వాహనంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్, టీబీ పర్యవేక్షకురాలు ఆర్.శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

భోగాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలం రాజాపులోవలో తహసీల్దారు సురేష్ స్థానిక పోలీసుల సహకారంలో శుక్రవారం పలు ఆక్రమణలు తొలగించారు. గ్రామంలో ఆక్రమణలు చోటు చేసుకోవడం, తేలకపాటి గృహాలు నిర్మించి అద్దెలకు ఇవ్వడం కొంత కాలంగా జరుగుతోంది. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన స్పందించారు. రహదారిని ఆక్రమించి నిర్మించిన శాల, గడ్డివాం తదితర వాటిని తొలగించారు. ఆక్రమణలు తొలగింపును స్థానికులు అడ్డుకోవడంతో వారికి అవగాహన కలిగించారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు హెచ్చరించారు. ఆయనతో పాటు ఆర్ఐ ఇమ్రాన్, ఎస్ఐ పాపారావు ఉన్నారు.

పోయిన బంగారం దొరికింది

భామిని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బస్సులో ఆరు తులాల బంగారు ఆభరణాలు మరిచిపోయారు.. వెంటనే పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన పోలీసులు ఆభరణాలు ఉన్న బ్యాగును వెతికిపెట్టి, బాధితులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బాలేరు గ్రామానికి చెందిన వడ్డాది రామకృష్ణ దంపతు లు శుక్రవారం హిరమండలంలో బంగారు వస్తువులు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి బస్సు ఎక్కి బాలేరులో దిగారు. అయితే బంగారం ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయారు. లబోదిబోమంటూ బత్తిలి ఎస్ఐ అనీల్ కుమార్‌కు సమాచారం అందించారు. ఆ సమయంలో బాలేరులో ఉన్న ఎస్ఐ వెంటనే అప్రమత్తమై బత్తిలి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడి పోలీసులు బస్సులో తనిఖీ చేశారు. బ్యాగు బస్సులో ఉండడంతో తీసుకున్నారు. ఈ ఆభరణాలను బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు అప్పగించారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశా లల ప్రహరీలు, బీటీ రోడ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడకుండా పగడ్బందీగా చేయాలని, లేదంటే తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎస్.రమేష్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.రవి అన్నారు. శుక్రవారం వారు మండలంలోని చినకుదమ, పెదకుదమ, వెంకట రాజపురం, జోగిరాజుపేట, పెదమేరంగి, తాళ్లడుమ్మ, అల్లువాడ, లింగాలవలస, శిఖబడి, జియ్యమ్మవలస గ్రా మా ల్లో లక్షలాది రూపాయలతో మంజూరైన పాఠశా లల ప్రహరీల నిర్మాణాలను పరిశీలించారు. తరువాత పెదకుదమ - గదబవలస, లోతువానివలస, డంగభద్ర - డంగభద్ర గదబవలస బీటీ రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. వీరి వెంట ఉపాధి హామీ జేఈ డి.తేజేశ్వరరావు ఉన్నారు. ● గరుగుబిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో నిర్మాణం చేపడుతున్న ప్రహరీల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. శుక్రవారం రావివలస జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులను ఆమె పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి సంబంధించి 11 పనులు ప్రారంభమయ్యాయన్నారు. నిర్మాణంలో లోపాలు నెలకొంటే చెల్లింపులు నిలుపుదల చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఉపాధి ఏపీవో ఎం.గౌరీనాథ్, పంచాయతీరాజ్ జేఈ ఎ.గౌరీశంకర్, ఉపాధి ఈసీ అవినాష్, టెక్నికల్ అసిస్టెంట్ కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం వద్దు

కురుపాం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలలో పాఠశాలల విలీనం నిలుపుదల చేయాలని గిరిజన సంఘల ప్రతినిధులు కోరుతున్నారు. ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు, ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరక చంద్రశేఖర్, గిరిజన సంఘాల ప్రతినిధి రొబ్బ లోవరాజు, సీతారం శుక్రవారం స్థానిక విలేకర్లతో మా ట్లాడారు. గిరిజన ప్రాంతాలలో ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామం వెళ్లడానికి సుమారు రెండు కిలో మీటర్లు ఉంటుందన్నారు. చిన్న పిల్లలు అడవీ ప్రాంతంలో వెళ్లలేర ని, పెద్దవారు పని మానుకొని వారిని తీసుకె ళ్లాల్సిన పరిస్థితి వస్తోంద న్నారు.

మెరుగైన బోధనకు కృషి చేయాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందించి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకర్ సూచించారు. శుక్రవారం రావివలస జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. పదో తరగతి పరీక్షల్లో మండలం ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఎంఈవో దత్తి అప్పలనాయుడు, ఐసీడీఎస్ సీడీపీవో జి.సుగుణకుమారి, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, సీహెచ్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

25న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీ ఎల్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పార్వతీపురం డివిజన్ పరిధిలోని సాలూరు సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కాగాన గోపాల్‌రావునాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ కార్య క్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్య నారాయణ, సాంకేతిక సభ్యులు హాజరవుతున్నట్టు తెలిపారు.

న్యూస్ బాక్స్

రైతులకు భూ ఆధార్ తప్పనిసరి

బాడంగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సొంత భూమి కలిగి ఉన్న రైతులందరూ తప్పకుండా భూఆధార్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష అన్నారు. స్థానిక సచివాలయంలో నిర్వహిస్తున్న భూ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. భూ ఆధార్ ఉంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆమె చెప్పారు.

వాట్సప్ సర్వీసును వినియోగించుకోండి

బాడంగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వాట్సప్ గవర్నెన్స్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. 95523 00009 నెంబరుకు వాట్సప్ చేసి ప్రభుత్వం అందిస్తున్న 158 రకాల సర్వీసులను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. ఈ సర్వీస్‌లను రానున్న రోజుల్లో వెయ్యి సేవలకు విస్తరిస్తారని కలెక్టర్ తెలిపారన్నారు.

పక్కాగా ఇంటింటి సర్వే

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామల్లో ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం శివడవలస గ్రామంలో ఇంటింటి జియో ట్యాగింగ్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక డ్రైవ్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం శివడవలస గ్రామంలో నిర్వహించిన ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని వెలుగు ఏపీఎం పి.భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం బొబ్బిలి వెలుగు కార్యాలయంలో మండల వీవోఏ (మహిళా గ్రూపు లీడర్లు)లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని, ఆర్థికంగా వృద్ధిలోకి రావాలన్నారు. సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం



తెలుగుతల్లికి పూలమాల వేస్తున్న రోటరీ క్లబ్ చైర్మన్ రాజు

బొబ్బిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృ భాషను పరిరక్షించుకుందామని రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం ముందు గల తెలుగుతల్లి విగ్రహానికి ఆయన పూలమాల వేశారు. తెలుగు అధ్యాపకుడు బొంతు శ్రీరాములు, భాషాభిమానులు పాల్గొన్నారు.